క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



కోవూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీకి ఎంపికైన కోవూరు నియోజకవర్గానికి చెందిన నాయకులు రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తమపై నమ్మకంతో బాధ్యతలను అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఇప్పగుంట విజయభాస్కర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు తుమ్మలపెంట పార్వతి, శ్రీదేవి, ఎస్‌కే షబ్బీర్ తదితరులు ఉన్నారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ



ఎమ్మెల్యేను కలిసిన ఎస్సై రంగనాథ్

కోవూరు: కోవూరు ఎస్సై దాసరి వెంకటేశ్వరరావు సీఐగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో రాపూరులో ఎస్సైగా పనిచేస్తున్న టి.రంగనాథ్ బదిలీపై కోవూరుకు వచ్చారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు శనివారం కోవూరులోని ఆయన కార్యాలయంలో నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నెల్లూరులో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పొదలకూరు: సెర్ప్‌లో అంతర్భాగమైన వైఎస్సార్ క్రాంతిపథం ఉద్యోగులు శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెర్ప్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ సీఎం వేతనాలను పెంచినందుకు కృతజ్ఞతగా పాలాభిషేకం చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రుణం తీర్చుకోలేనిదన్నారు. మంత్రి కాకాణికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం రోజ్‌మేరీ, సీసీ దయాకర్, వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, పూకోటి లక్ష్మీనారాయణ, కోఆప్షన్ సభ్యుడు దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా ఈసీ మెంబర్‌గా భారతమ్మ



బొల్లినేని భారతమ్మ

పొదలకూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పొదలకూరుకు చెందిన బొల్లినేని భారతమ్మను నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో పలువురు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం భారతమ్మ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యా ఉపకరణాల అందజేత



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని దామరమడుగు పంచాయతీ పరిధిలో ఉన్న పల్లిపాళెం గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం సహారా ఎడ్యుకేషల్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం విద్యా ఉపకరణాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ సహారా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ప్రతి సంవత్సరం నోట్‌పుస్తకాలు, పెన్నులు, పలకలు, పెన్సిళ్లు అందజేయడం అభినందనీయమన్నారు. దాత మౌలాలీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకులు ఎస్దానీబాషా, ఉపాధ్యాయులు రమణారెడ్డి, పద్మ, రాజేష్ పాల్గొన్నారు.

బదిలీలకు 31న కౌన్సెలింగ్

నెల్లూరు రూరల్: ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 46 మండలాల్లో విధులు నిర్వర్తిస్తున్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు, మండల స్థాయి అకౌంట్స్, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, ఆఫీస్ సబార్డినేటర్ల బదిలీలకు కేటగిరీల వారీగా దరఖాస్తు చేసుకున్న వారికి కౌన్సెలింగ్‌ను నగరంలోని సమగ్రశిక్ష కార్యాలయంలో ఈ నెల 31న నిర్వహించనున్నామని సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి తెలిపారు. అభ్యంతరాలను సోమవారం సాయంత్రంలోపు తెలియజేయాలని కోరారు.

ముమ్మరంగా వరికోతలు

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో ధాన్యం ధరలు కూడా రైతులు ఆశించిన దానికన్నా అధికంగా ఉండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైతులు కల్లాల్లోనే ధాన్యాన్ని విక్రయించుకుని లాభాలు పొందుతున్నారు.

- ఖరీఫ్‌లో గరిష్టస్థాయికి ధాన్యం ధరలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్నలు



కోతకు వచ్చిన వరి పంటను కోస్తున్న యంత్రం

బుచ్చిరెడ్డిపాళెం: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా ఖరీఫ్‌లో 1.05 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. వరి కోతలు ముమ్మరంగా ప్రారంభమైన నేపథ్యంలో దళారులు, మిల్లర్లు రైతుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటీవల అడపాదడపా చిరుజల్లులు కురుస్తుండడంతో రైతులు మరో వారం రోజుల వ్యవధిలో కోయాల్సిన పంటను కూడా ముందుగానే కోసేస్తున్నారు. ప్రస్తుతం ధాన్యానికి మార్కెట్‌లో ధర బాగా ఉండడంతో రైతులు కల్లాల్లోనే విక్రయిస్తున్నారు.

ధరలు ఆశాజనకం

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువ మంది రైతులు కేఎన్‌ఎం–1638, కేఎన్‌ఎం–733, ఎంటీయూ–1010 రకాలకు చెందిన వరివంగడాలను సాగు చేశారు. ప్రస్తుతం వరి కోతలు ప్రారంభం కావడంతో మిల్లర్లు, దళారులు నేరుగా రైతుల వద్దకు వెళ్లి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. కేఎన్‌ఎం–1638 రకం ధాన్యం ధర రూ.18,700, కేఎన్‌ఎం–733 రకం ధాన్యం ధర రూ.19,000, ఎంటీయూ–1010 రకం ధాన్యం ధర రూ.16,700 పలుకుతుండడంతో రైతులు కల్లాల్లోనే విక్రయిస్తున్నారు.

జిల్లాలో..

ఖరీఫ్‌లో వరిసాగు విస్తీర్ణం	: 1.05 లక్షల ఎకరాలు
సాగు చేసిన వరి వంగడాలు	: కేఎన్‌ఎం-1638 కేఎన్‌ఎం-733 ఎంటీయూ-1010

రైతు ఇంట.. లాభాల పంట

ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఆనందంగా ఉన్నారు. ప్రస్తుతం ఎకరా వరి సాగుకు రూ.30 వేలు ఖర్చవుతుండగా, ఎకరాకు 3 నుంచి 3.5 పుట్ల(పుట్టి–848 కిలోలు) వరకు ధాన్యం దిగుబడి అవుతోంది. దీంతో సాధారణ రైతులతోపాటు కౌలు రైతులకు కూడా పెట్టుబడులు పోను ఎకరాకు కొంత లాభం వస్తుండడంతో ఆనందం వ్యక్తం చేశారు. రైతుల వద్ద నుంచి మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంతో మిల్లర్లు, దళారులు దిగివచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. తద్వారా అన్నదాతలు పండించిన ధాన్యానికి అధిక ధర లభిస్తోంది.



కల్లంలోనే ధాన్యం విక్రయిస్తున్న దృశ్యం

లాభాలు రావడం ఆనందంగా ఉంది



ఖరీఫ్‌లో ఎన్నడూ లేనివిధంగా ధాన్యానికి మంచి ధరలు వస్తున్నాయి. పెట్టిన పెట్టుబడులతోపాటు లాభాలు రావడం ఆనందంగా ఉంది. మిల్లర్లు, దళారులు రైతుల వద్దకే వచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు.

– వెంకటరమణయ్య, బుచ్చిరెడ్డిపాళెం

తక్కువ ధరలకు కొనుగోలు చేస్తే చర్యలు

ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. మిల్లర్లు, దళారులు కుమ్మక్కై ధాన్యం ధరలు తగ్గిస్తే చర్యలు తీసుకుంటాం. దళారులు, మిల్లర్లు తక్కువ ధరలకు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తే స్థానిక వ్యవసాయాధికారిని సంప్రదించాలి.



– సుధాకర్‌రాజు, జిల్లా వ్యవసాయాధికారి

చట్టాలపై అవగాహన అవసరం

- న్యాయమూర్తి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం

మనుబోలు: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని తిరుపతి జిల్లా 7వ అడిషనల్ సెషన్స్ జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మనుబోలులోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానమేనని తెలిపారు. పోక్సో చట్టం బాలికలకు రక్షణగా నిలుస్తోందని, బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని తెలిపారు. ప్రామిసరీ నోటుపై చూడకుండా సంతకాలు చేయడం, వేలిముద్ర వేయడం చేయరాదన్నారు. ఉచిత న్యాయ సహాయం, గృహ హింస చట్టం, న్యాయ సేవా సంస్థ అందించే సేవలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో తహసీల్దార్ శివకృష్ణయ్య, ఎస్సై అజయ్ కుమార్, ఏఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం

మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థాలు

వెంకటాచలం: మాదక ద్రవ్యాల వినియోగంతో చాలా అనర్థాలు ఉన్నాయని నెల్లూరు–2 సెబ్ సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై మండలంలోని చెముడుగుంట, వెంకటాచలం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కరరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ శకుంతలాదేవి తదితరులు పాల్గొన్నారు.



చెముడుగుంట పాఠశాలలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

వరలక్ష్మీవ్రతానికి పిలిచి టీడీపీ కండువా కప్పారు

కోవూరు(విడవలూరు): టీడీపీ మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మండలంలోని చౌకచర్ల గ్రామంలో కొంతమందిని పిలిచి బలవంతంగా తెలుగుదేశం పార్టీ కండువా కప్పారని చౌకచర్ల పంచాయతీ 4 వార్డు సభ్యురాలు అరణి విజయలక్ష్మి వాపోయారు. తమను మోసం చేసి తమ ఆత్మాభిమానంపై దెబ్బకొట్టడం తెలుగుదేశం పార్టీ నాయకులకు మంచి పద్ధతి కాదన్నారు. జరిగిన విషయాన్ని స్థానిక నాయకులతో కలిసి శనివారం నెల్లూరులో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి వివరించి ఆయన సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువాను కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులకు మతిభ్రమించి ప్రవర్తిస్తున్నారని, టీడీపీ నాయకులు కుతంత్రాలు పన్నినా తామంతా ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి వెంటే నడుస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి మాట్లాడుతూ పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దినేష్‌రెడ్డి ఇలాంటి చౌకబారు పనులు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి పవన్‌కుమార్‌రెడ్డి, కొమ్మిరెడ్డి మురళీకృష్ణారెడ్డి, సర్పంచ్ అలగాని విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్న వార్డు మెంబర్ విజయలక్ష్మి

రిజిస్ట్రేషన్లలో బయటి వ్యక్తుల జోక్యం తగదు

- జిల్లాలో 260 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు

పొదలకూరు : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లకు సంబంధించి బయటి వ్యక్తుల జోక్యం ఉంటే చర్యలు తీసుకుంటామని, డాక్యుమెంట్ రైటర్లు కార్యాలయం లోపలికి రాకూడదని జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు పేర్కొన్నారు. పొదలకూరు పట్టణంలో ఓ ప్లాటు రిజిస్ట్రేషన్‌లో ఏర్పడిన వివాదంపై శనివారం విచారణ చేపట్టేందుకు ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాసులురెడ్డి అనే వ్యక్తి తనకు సంబంధించిన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసేందుకు స్థానిక కార్యాలయంలో డాక్యుమెంట్లను అందజేశారని, అయితే సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ నిలిపివేయడంతో తనకు అప్పీలు చేసుకున్నారని, దీంతో స్థలం ఎక్కడ ఉందో లింకు డాక్యుమెంట్ల ద్వారా తేల్చేందుకు వచ్చామన్నారు. సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్‌ఆర్ రిజిస్ట్రేషన్ చేయకుంటే జిల్లా రిజిస్ట్రార్‌కు అప్పీలు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఎనీవేర్ కింద రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనైనా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, ఇందుకు సంబంధించి ఎస్‌ఆర్ 48 గంటల్లో కీ విడుదల చేసి యాక్సెప్ట్ లేదా రిజెక్ట్ చేయవచ్చన్నారు.

జిల్లాలో 260 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు

ప్రస్తుతం జిల్లాలో 260 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్టు జిల్లా రిజిస్ట్రార్ తెలిపారు. మొదటి విడతలో 51 సచివాలయాలు, రెండో విడతలో 111 సచివాలయాలు, మూడో విడతలో 98 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లను ప్రారంభించినట్లు తెలిపారు. అయితే ఆయా సచివాలయాల పరిధిలో భూముల రీసర్వే పూర్తయితేనే రిజిస్ట్రేషన్లు చేసేందుకు వీలవుతుందన్నారు. పొదలకూరు మండలంలో 14 గ్రామాల్లో ఇప్పటి వరకు సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 250 రిజిస్ట్రేషన్లు సచివాలయాల ద్వారా చేశామని, సచివాలయ ఉద్యోగులకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. జిల్లా రిజిస్ట్రార్ వెంట సబ్‌రిజిస్ట్రార్ శోభమ్మ ఉన్నారు.



వివాదానికి కారణమైన స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు

బైక్ అదుపుతప్పి పడిపోయి..

- వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: బైక్ అదుపుతప్పి పడిపోయి వ్యక్తి గాయపడిన ఘటన వెంకటాచలం మండలంలోని కసుమూరు సమీపంలో శనివారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన ఫయాజ్ పనినిమిత్తం బైక్‌పై కసుమూరుకు వెళ్లాడు. తిరిగి నెల్లూరు వచ్చే క్రమంలో కసుమూరు మలుపురోడ్డు వద్ద ఆటో అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఫయాజ్‌కు గాయాలు కావడంతో చికిత్సనిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొంతు నొప్పిని అశ్రద్ధ చేయకండి

మనుబోలు: గొంతు నొప్పిని అశ్రద్ధ చేయవద్దని పీహెచ్‌సీ వైద్యురాలు గేయపూజిత సూచించారు. మనుబోలులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆమె గొంతు నొప్పితో బాధపడే వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గొంతు నొప్పి చెవి ఇన్‌ఫెక్షన్‌కు దారితీసి ఊపిరితిత్తులకు సోకే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

భూమి వివరాలు అనుసంధానం చేయాలి

కొడవలూరు: పీఎం కిసాన్ పథకానికి అర్హులు కావాలంటే రైతుల ఆధార్‌కు భూమి వివరాలను అనుసంధానం చేయాలని కోవూరు ఏడీఏ డి.సుజాత సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఏఏలు, వీఆర్వోలతో శనివారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 128 మంది రైతుల ఆధార్‌లకు భూమి వివరాలు అనుసంధానం కావాల్సి ఉందన్నారు. తహసీల్దార్ ఇ.రమాదేవి మాట్లాడుతూ భవిష్యత్‌లో ప్రతి పథకానికి ఆధార్ అనుసంధానం కావాల్సిన నేపథ్యంలో ప్రతి రైతు భూమిని ఆధార్‌కు అనుసంధానం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వీఆర్వోలు, వీఏఏలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నెలాఖరు లోపు మండలంలోని 128 మంది రైతుల భూముల వివరాలను వారి ఆధార్‌లకు అనుసంధానం చేయాలని సూచించారు. సమావేశంలో ఏఓ సీహెచ్‌ఎస్ లక్ష్మి, డీటీ గున్నం మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

కోవూరు: గూడూరు–బిట్రగుంట 3వ రైల్వే లైన్ పనుల విషయంలో దాదాపు 10 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పనులు పూర్తి చేసి ఉన్నామని, తమకు దాదాపు రూ.40 కోట్లు కేఈసీ కంపెనీ చెల్లించాల్సి ఉందంటూ పనులు చేసిన కంపెనీల యజమానులు పేర్కొన్నారు. కోవూరులోని పడుగుపాడు రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న కేఈసీ కార్యాలయానికి బాధిత కంపెనీల ప్రతినిధులు శనివారం తాళాలు వేశారు. ఈ సందర్భంగా జేపీ, ఎస్‌ఈపీఎల్, గట్టుపాటి, శ్రీవెంకటేశ్వర, రామదాసు, నరేంద్రరెడ్డి, రమణారెడ్డి, చరణ్, ఎస్వీ, రాజేంద్ర తదితర కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతూ గూడూరు–బిట్రగుంట 3వ రైల్వే లైన్ పనులను కేఈసీ కంపెనీ ద్వారా తమ కంపెనీలు పూర్తి చేశాయని తెలిపారు. అయితే ఆర్వీఎన్‌ఎల్ నుంచి కేఈసీ కంపెనీకి డబ్బులు వచ్చాయని, ఆ కంపెనీ తమకు రూ.40 కోట్ల వరకు చెల్లించాల్సి ఉందని తెలిపారు.

ఎమ్మెల్యే ప్రసన్న దయాహృదయుడు



ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి
- 17 మందికి రూ.5.90 లక్షలతో బ్యాటరీ ట్రై సైకిళ్ల పంపిణీ

కోవూరు: కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి దయాహృదయుడని, ఆయనకు దానగుణం ఎక్కువ అని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కోవూరులో శనివారం బ్యాటరీ ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి ఎంపీ పాల్గొన్నారు. బ్యాటరీ ట్రై సైకిళ్లను ఒక్కొక్కటికి రూ.35 వేల వ్యయంతో రూ.5.95 లక్షలు వెచ్చించి ఎమ్మెల్యే సమకూర్చగా, ఇందుకూరుపేట, కొత్తూరు ప్రాంతాలకు చెందిన 17 మంది దివ్యాంగులకు ఎంపీ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఏ ప్రాంతంలో ఏ సమస్య ఎమ్మెల్యే దృష్టికి వచ్చినా వెంటనే తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తోచినంత ఆర్థికసాయం అందించడం గొప్ప విషయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా కోవూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 96,991 గడపలకు వెళ్లి ప్రజలతో మమేకమై ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించామని తెలిపారు. సెప్టెంబర్ 3వ తేదీకి లక్ష గడపలు పూర్తి చేసుకొని మైపాడులో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావులతోపాటు పలువురు సీనియర్ నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఇందుకూరుపేటకు చెందిన ఇద్దరు చిన్నారులు చినిగి సిరి వెంకట వైదేయ్, చినిగి అనివేమనిలకు ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున సొసైటీలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్లను ఎంపీ చేతుల మీదుగా వారికి అందజేశారు. ట్రై సైకిళ్లు అందుకున్న వారిలో కొత్తూరు నుంచి కోనేటి అమ్మణి, తోడేటి వెంకయ్య, దంపూరు కన్యకాపరమేశ్వరి, షేక్ ఆసిఫ్ ఇమ్రాన్, చేకూరు శీనయ్య, పూనమల్లి శ్రీహరి, పండేటి వెంకటరమణయ్య, ఇందుకూరుపేట నుంచి షేక్ జమాల్, పోలూరు గాయత్రి, పూనమల్లి వెంకటరమణయ్య, కుప్పా మల్లికార్జున, షేక్ ఖలీల్, కోలగట్ల సురేష్‌బాబు, పత్రా మునెయ్య, ఓసూరు సాంబయ్య, గోడ సురేంద్ర ఉన్నారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండిరెడ్డి రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులు, సురేష్‌రెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, డీసీఎమ్మెస్ డైరెక్టర్ గునపాటి సురేష్‌రెడ్డి, భానుశేఖర్, సొసైటీ చైర్మన్ సురేంద్రరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- జెడ్పీ సీఈఓ చిరంజీవి

మనుబోలు: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని జెడ్పీ సీఈఓ చిరంజీవి పేర్కొన్నారు. మండలంలోని చెర్లోపల్లి, జట్లకొండూరు గ్రామ సచివాలయాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ఇంటి ముంగిటకే చేర్చేందుకు ప్రభుత్వం సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ కార్యాలయం ఏఓ రవికుమార్‌రెడ్డి, సిబ్బంది గాంధీ, తిరుమలకుమార్ తదితరులు ఉన్నారు.



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

విద్యార్థులకు పద్యాల పోటీలు



బుచ్చిరెడ్డిపాళెం : తెలుగుభాషా దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



వెంకటాచలం : విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

బుచ్చిరెడ్డిపాళెం: తెలుగుభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుచ్చిరెడ్డిపాళెంలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రిసోర్స్‌పర్సన్ గండికోట సుధీర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మన మాతృభాష తెలుగును మాట్లాడాలని పిలుపునిచ్చారు. చాలా మంది విదేశీ భాషల మోజులో పడి మాతృభాషను మరచిపోతున్నారని, ఇది సరికాదని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుభాషా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వేదవతి, ఉపాధ్యాయులు నిర్మల, మున్వర్‌అహ్మద్, విజయకుమారి పాల్గొన్నారు.

తెలుగుభాషా దినోత్సవ వేడుకలు

వెంకటాచలం: మండలంలోని నిడిగుంటపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం తెలుగుభాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, వేషధారణ, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ చలపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మదర్ థెరిసాకు ఘన నివాళి



మదర్ థెరిసా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం, విద్యార్థులు



బుచ్చిరెడ్డిపాళెం: దామరమడుగు పాఠశాలలో..

కొడవలూరు: మదర్ థెరిసా జయంతి వేడుకలను శనివారం కొడవలూరు మండలంలోని వెంకన్నపురం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు మదర్ థెరిసా చిత్రపటం వద్ద ఘన నివాళులర్పించారు. హెచ్‌ఎం తాటిపర్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మదర్ థెరిసా సమాజానికి అందించిన సేవలకు గాను నోబెల్ శాంతి పురస్కారం లభించిందని తెలిపారు.

దామరమడుగులో..

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని దామరమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం మదర్ థెరిసా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్‌ఎం సర్దార్ మాట్లాడుతూ ప్రేమ, సేవా భావానికి మదర్ థెరిసా చిరునామా అని కొనియాడారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృపాల్, భాస్కరయ్య, నాగజ్యోతి, నరసయ్య, శ్రీనివాసులు, సిద్దయ్య, ఇంతియాజ్, మదన్, రవి, రసూల్ పాల్గొన్నారు.

ఐటీఐలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో కంప్యూటర్ ల్యాబ్‌ను శనివారం ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన కాంక్రీట్ ఇన్ఫ్రా డెవలపర్స్ ఇండియా లిమిటెడ్ దాతృత్వంతో పది కంప్యూటర్లను ఐటీఐకు అందజేశారు. ఈ క్రమంలో ల్యాబ్‌ను ప్రారంభించారు. ఐటీఐ, ఐఎంసీ చైర్మన్ నిరంజన్, ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఉపాధి అధికారి రామాంజనేయులు, పాలిటెక్నిక్ కళాశాల హెడ్ శివకుమార్, ఐటీఐ ట్రెయినింగ్ ఆఫీసర్ చెంగ్రాయన్, తదితరులు పాల్గొన్నారు.

